https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 27 గురువారం 21-05-2026 పేజీలు : 4




## విజయ్‌కు మిత్రపక్షాల సెగ!

**అన్నాడీఎంకే నేతలను మంత్రులుగా తీసుకోవద్దని డిమాండ్**

**కాదంటే మద్దతుపై పునరాలోచన చేస్తామని స్పష్టీకరణ**

**తమిళనాట నేడు మంత్రివర్గ విస్తరణ**



**చెన్నై, మే 20**

తమిళనాడు అధికార పార్టీ టీవీకేకు ఆదిలోనే తలనొప్పులు ఎదురయ్యాయి. అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు కూడా సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో సదరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తే.. ఊరుకునేది లేదని టీవీకేకు మద్దతు ఇస్తున్న సీపీఎం, సీపీఐ, వీసీకే పార్టీలు తేల్చి చెప్పారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకుంటే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే విషయంపై పునరాలోచన చేస్తామని హెచ్చరించాయి. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ కార్యదర్శి వీరపాండ్యన్, వీసీకే అధినేత తిరుమావళవన్ ప్రకటించారు. బుధవారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీతో చేతులు కలిపి ఎన్నికల్లో పోటీ చేసిన అన్నాడీఎంకే తరఫున వారు విజయం సాధించారని గుర్తు చేశారు. అలాంటి వారిని సీఎం విజయ్ తన మంత్రివర్గంలోకి తీసుకోవడం ఏమాత్రం సబబు కాదని స్పష్టం చేశారు. అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకోబోమని తమకు గతంలోనే టీవీకే నేతలు చెప్పారని తెలిపారు. ఆ హామీకి సీఎం విజయ్ కట్టుబడి ఉండాలన్నారు. మరోవైపు, గురువారం విజయ్ తన మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు లోక్‌భవన్‌లో గవర్నర్ అర్లేకర్ నూతన మంత్రులతో ప్రమాణం చేయించనున్నారు. కాగా, టీవీకేకు మద్దతు ఇస్తున్న కాంగట?ప్రకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని విజయ్ నిర్ణయించారు. ఇక వీసీకే, ఐయూఎంఎల్‌లను కూడా మంత్రి వర్గంలో చేరాలంటూ టీవీకే బహిరంగ ఆహ్వానం పంపింది. వారికి చెరొక మంత్రి పదవి ఇవ్వాలని విజయ్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, టీవీకే మంత్రివర్గం ఉమ్మడి కుటుంబంలా సామాజిక న్యాయం కోసం పాటుపడేలా ఉండాలని సీఎం విజయ్ భావిస్తున్నారని మంత్రి ఆదవ్ అర్జున తెలిపారు. అన్నాడీఎంకే అసమ్మతి వర్గాన్ని తాము మిత్ర పక్షంగానే భావిస్తామన్నారు.

# ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో రాజీ వద్దు

**అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు**

**నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలి**

**ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలకు జూన్‌లో శంకుస్థాపన**

**పెట్టుబడుల ఆకర్షణకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట విభాగం**

**ఫ్యూచర్‌సిటీలో ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు,సివిల్ సర్వీస్ అధికారులకు 500 ఎకరాల కేటాయింపు**

**1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు**

**జిల్లాలకూ ఐటీ కంపెనీలు వచ్చేలా చర్యలు**

**3 నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు టీ-ఫైబర్‌తో అనుసంధానం**

**ఐటీ, పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



**హైదరాబాద్, మే 20**

ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో (కర్బన ఉద్గారాలు లేని) సిటీ తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం బోధి పెవిలియన్‌లో ఐటీ, పరిశ్రమల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ బయట కూడా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటు కోసం పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలని, ఈ మేరకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలన్నారు. ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని.. 'బియాండ్ క్యూర్' (కోర్ అర్బన్ రీజియన్) ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణ పెద్దగా లేని చోట్ల కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని.. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రహదారుల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూడు నెలల్లో టీ ఫైబర్‌కు అనుసంధానం కావాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై త్వరలో సమీక్ష నిర్వహించాలని సీఎస్‌ను ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే టీ-ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.54 కోట్ల ఆర్డర్లు వచ్చినట్లు సంబంధిత అధికారులు సీఎంకు తెలిపారు. సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

## 92 మంది ఖైదీలకు క్షమాభిక్ష

**ఫైలుకు గవర్నర్ ఆమోదం**



**హైదరాబాద్, మే 20**

రాష్ట్ర ప్రభుత్వం 92 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష(రెమిషన్) ప్రసాదించింది. క్షమాభిక్ష కోసం ప్రభుత్వం పంపిన ఈ 92మంది ఖైదీల జాబితాకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోదముద్ర వేశారు. ప్రభుత్వం పంపిన క్షమాభిక్ష ప్రతిపాదనలపై గవర్నర్ బుధవారం ఉదయం లోక్‌భవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా, ఐజీ మురళీ బాబు హాజరయ్యారు. సమావేశం అనంతరం ప్రతిపాదిత జాబితాను గవర్నర్ ఆమోదించి ప్రభుత్వానికి పంపించారు. వీరిలో 86 మంది పురుష ఖైదీలు, ఆరుగురు మహిళా ఖైదీలు ఉన్నారు. గవర్నర్ ఆమోదం తెలిపిన ఫైల్ ప్రభుత్వానికి చేరింది. అయితే, ఖైదీల విడుదలకు ప్రభుత్వం జీవో జారీ చేయాల్సి ఉంది. ఆ తర్వాతే ఖైదీలు జైళ్ల నుంచి విడుదల అవుతారు. తెలంగాణ అవతరణ దినోత్సవం(జూన్ 2) రోజున ఖైదీలు విడుదల అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 2024, జూన్ 2న 213 మంది ఖైదీలకు ప్రత్యేక రెమిషన్ మంజూరు చేసింది. వీరిలో 178 మంది పురుషులు, 35 మంది మహిళా ఖైదీలు ఉన్నారు.

## నా శవంపైనా కాషాయ జెండానే కప్పాలి

**- బీజేపీ కార్యకర్త ఎవరైనా ఇదే కోరుకుంటారు**

**- బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టింది మేమే**

**- ఆ కోపంతోనే పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు - ఫేక్‌గాళ్ల ఆరోపణలపై స్పందించనక్కర్లేదు**

**- కొడుకుపై ఆరోపణలొస్తే పోలీసులకు అప్పగించా - మీడియాతో బండి సంజయ్**




**హైదరాబాద్, మే 20**

"నేను చనిపోయాక నా శవంపైనా కాషాయ జెండా కప్పాలన్నదే నా చివరి కోరిక. బీజేపీలో కమిట్‌మెంట్‌తో పని చేసే కార్యకర్త ఎవరైనా ఇదే కోరుకుంటారు" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తాను కొత్త పార్టీ పెడుతున్నానని, కేంద్ర కేబినెట్ నుంచి తనను బర్తరఫ్ చేయబోతున్నారనే ప్రచారాలను ఆయన ఖండించారు. ఫేక్‌గాళ్ల ప్రచారాలపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్‌కు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. 'సంజయ్.. ఆప్ సంఘర్ష్ కరో.. హమ్ తుమ్హారే సాథ్ హై' అంటూ నినాదాలు చేశారు. అనంతరం సంజయ్‌తో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నేతలతో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు. తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న ప్రచారంపై స్పందిస్తూ.. ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాలకు స్పందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. క్యాబినెట్ నుంచి తనను తొలగించబోతున్నారనే వార్తలపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. "బీఆర్ఎస్ ఎంపీల మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోందేమో.. అందుకే కేసీఆర్, కేటీఆర్ నన్ను బర్తరఫ్ చేయాలని నిర్ణయించి ఉంటారు" అని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టామన్న కోపంతోనే ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. "భగీరథ్ కేసు కోర్టు పరిధిలో ఉంది. పోలీసులు విచారణ కోరితే నేనే నా కొడుకును అప్పగించాను. నేను ప్రజల మధ్య ఉన్నాను. కానీ సోషల్ మీడియాలో నాపై విషప్రచారం చేస్తున్నారు. ఎన్ని తప్పుడు కథనాలు ప్రచారం చేసినా ప్రజలు బీజేపీతోనే ఉంటారు"అని స్పష్టం చేశారు.

## సుదూర శత్రువుపై 'సూర్యాస్త్రం'

**300 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిన సూర్యాస్త్ర**

**సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థ పరీక్ష విజయవంతం**



**బాలాసోర్, మే 20:**

భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా, స్వదేశీ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి సరికొత్త ఊతమిచ్చేలా మరో కీలక ముందడుగు పడింది. పుణెకు చెందిన ప్రైవేటు రక్షణ సంస్థ 'నిబె లిమిటెడ్' స్వదేశీయంగా అభివృద్ధి చేసిన 'సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచర్' వ్యవస్థను విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)లో ఈ నెల 18, 19వ తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలను 'సూర్యాస్త్ర' అత్యంత కచ్చితత్వంతో ఛేదించినట్టు తెలిపింది. ఈ ఏడాది జనవరిలో భారత సైన్యం అత్యవసర సేకరణ కింద నిబే లిమిటెడ్‌కు కీలకమైన కొనుగోలు ఆర్డర్ ఇచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచర్‌తోపాటు 150 కి.మీ., 300 కి.మీ. పరిధిగల రాకెట్ల అభివృద్ధి, సరఫరాను నిబే సంస్థ వేగవంతం చేసింది. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన టెస్టుల్లో సూర్యాస్త్ర రాకెట్ వ్యవస్థలో రెండు వేరియంట్లను పరీక్షించగా అవి అత్యంత కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని ఆ సంస్థ తెలిపింది. 150 కి.మీ పరిధిగల రాకెట్ 1.5 మీటర్ల సీఈపీ (సర్క్యులర్ ఎర్రర్ ప్రాబబుల్)ని, 300 కి.మీ. పరిధి గల రాకెట్ 2.0 మీటర్ల సీఈపీని నమోదు చేసినట్టు పేర్కొంది. రక్షణ రంగంలో ఉపయోగించే మందుగుండు లేదా రాకెట్ సామర్థ్యంలో 50 శాతం పడిపోయే వ్యాసార్థాన్ని కొలిచే కొలమానాన్ని సీఈపీ అంటారు. ఈ వ్యాసార్థం ఎంత తక్కువగా ఉంటే.. ఆయుధం అంత కచ్చితంగా లక్ష్యాన్ని తాకినట్టు లెక్క. 300 కి.మీ. ప్రయాణించినా రెండు మీటర్ల కంటే తక్కువ వ్యాసార్థంలో లక్ష్యాన్ని దెబ్బతీయడం ద్వారా ప్రపంచంలోని అత్యంత కచ్చితమైన సుదూర రాకెట్ వ్యవస్థల్లో సూర్యాస్త్ర ఒకటిగా నిలిచింది.

## ప్రక్షాళనకు వేళయిందా?

**నేడు క్యాబినెట్ సహా స్వతంత్ర మంత్రులు, సహాయ మంత్రులతో ప్రధాని భేటీ**



**న్యూఢిల్లీ, మే 20**

ప్రధాని మోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. పైకి సాధారణ సమావేశం లాగే కనిపిస్తున్నా మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించనున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కొందరిని మంత్రివర్గం నుంచి తప్పిస్తారంటూ వార్తలు గుప్పుమంటున్న నేపథ్యంలో పాతికమందికి పైగా మంత్రులకు ఇదే చివరి మంత్రివర్గ సమావేశం కానుందనే మాట కూడా వినిపిస్తోంది. మోదీ ప్రభుత్వంలోని 30మంది క్యాబినెట్ మంత్రులు, 36మంది సహాయ మంత్రులు, స్వతంత్ర హోదా కలిగిన ఐదుగురు మంత్రులు.. ఇలా మొత్తంగా 72 మంది మంత్రులు మోదీ అధ్యక్షతన ఈ సమావేశంలో పాల్గొననున్నారు. మోదీ ప్రభుత్వంలోని మంత్రులంతా సమావేశం కానుండటం ఈ ఏడాది ఇదే తొలిసారి. మంత్రుల పనితీరు, ప్రవర్తన వంటివి ప్రాతిపదికగా తీసుకొని పెద్ద సంఖ్యలో మంత్రులను సాగనంపేందుకు ఏర్పాట్లు జరగుతున్నాయని సమాచారం. వివాదాలతో వార్తల్లో నిలిచిన మంత్రులకు ఊస్టింగ్ తప్పదని తెలుస్తోంది. మంత్రివర్గ సమావేశం సందర్భంగా వివిధ మంత్రిత్వశాఖల పనితీరు, ఇటీవల కాలంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలు చర్చకురానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర సంక్షేమ పథకాల అమలు తీరు, సాధించిన విజయాలపై సమీక్ష చేయనున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులు, ఆ కారణంగా ఆర్థికంగా మనదేశమ్మీద పడిన ప్రభావంపై చర్చించనున్నారు. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధ ప్రభావం కారణంగా దేశంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల ప్రభావం ప్రజలపై అతి తక్కువగా పడేలా ఏమేం చేయొచ్చు? అన్న విషయమ్మీద మంత్రులు, విభాగాలకు మోదీ దిశానిర్దేశం చేయనునన్నట్లు తెలిసింది.

## ధర్మపురి పట్టణంలోని లాడ్జ్ సీజ్

**ధర్మపురి మే 20**

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న విజయలక్ష్మి లాడ్జ్ ను సీజ్ చేసిన మున్సిపల్ మరియు పోలీస్ అధికారులు పట్టణంలోని ఎలాంటి అనుమతులు లేకుండా లాడ్జిలు గాని ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా, నియమ నిబంధనలు పాటించకుండా గదులు అద్దెకి ఇచ్చే వారి పైన కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మరియు ధర్మపురి సీఐ రామ్ నరసింహ రెడ్డి అన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు ఏపీలోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కృష్ణాజిల్లా కంకిపాడులో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 46.1 డిగ్రీలు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 46 డిగ్రీలు నమోదు తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు తెలంగాణలోని హన్మకొండలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు జగిత్యాలలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీలు

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యుడు

**ధర్మపురి మే 20**



జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని ఆరోగ్య హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం బి పాజిటివ్ రక్తం అవసరం అని పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతు స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్ ని సంప్రదించగా సామాజిక సేవకుడు, అసోసియేషన్ సభ్యులు అనంతుల రమేష్ కి సమాచారం తెలపగా రమేష్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంకు వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది. అత్యవసర సమయంలో రక్త దానం చేసిన అనంతుల రమేష్ ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్ మరియు సభ్యులు, బండారి శివకుమార్ మరియు పేషెంట్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభినందించారు.

## కరీంనగర్ సమ్మర్ క్యాంపులు విద్యలో కొత్త ఉద్యమంగా నిలుస్తున్నాయి:అధికారి డా. అశ్విని తానాజీ వాకడే

**కరీంనగర్, మే 20**



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, జిల్లా కలెక్టర్ ఔ చైర్‌పర్సన్ సమగ్ర శిక్ష మార్గదర్శకత్వం మరియు ప్రత్యేక చొరవతో కరీంనగర్ జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో సమ్మర్ క్యాంపులునిర్వహిస్తున్నారు.జిల్లా ప్రాజెక్టు అధికారి డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా ప్రగతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, శారీరక దృఢత్వం మరియు వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు కల్పిస్తున్నారు. సమ్మర్ క్యాంపులు నైపుణ్యాలను మాత్రమే కాదు, విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కూడా ఉపయోగపడుతున్నాయి," అని ఆమె పేర్కొన్నారు.అలాగే మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులుఉపాధ్యాయులు విద్యార్థుల గరిష్ట భాగస్వామ్యాన్ని కలిపించేట్లు చూడాలని కోరారు.స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ కార్యక్ర మాలను క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ అశోక్ రెడ్డి మరియు గంగాధర మండల విద్యాశాఖాధికారి శ్రీ ప్రభాకర్ రావు సమన్వయం చేస్తూ విద్యార్థుల పాల్గొనుటను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలలో నమోదు పెంపుతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం మరియు భవిష్యత్ సిద్ధతకు ఎంతో దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# 'సర్'కు సిద్ధం

### ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

**అమరావతి, మే 20**

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడతామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. ఇంటింటి సర్వే ద్వారా మృతులు, నకిలీ, అక్రమంగా చేరిన పేర్లను తొలగిస్తామని తెలిపారు. ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా కఠిన ధ్రువీకరణ చేపడతామని చెప్పారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ఓటరు జాబితాలో అనర్హులకు చోటుండకూడదు, అర్హులను జాబితా నుంచి తప్పించకూడదనే లక్ష్యంతో ఎన్యుమరేషన్ చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 46,397 మంది బీఎల్‌వోలు జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేపడతారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫాంలు ఇస్తారు. వాటిలో ఒక ఫాంను ఓటరు స్వయంగా పూర్తిచేసి ఇవ్వాలి. ఇక రెండోదానిపై బీఎల్‌వో సంతకం చేసి ఎక్నాలెడ్జ్‌మెంట్‌గా ఓటరుకు ఇస్తారు. జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తాం. అనంతరం నెల రోజుల పాటు క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరిస్తాం. అనర్హులకు నోటీసులు జారీ చేసి రెండు నెలల్లో వాటిని పరిష్కరిస్తాం. ఈ దశలన్నీ పూర్తయిన తర్వాత సెప్టెంబరు 22న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తాం' అని ఆయన వెల్లడించారు. 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత విభజిత రాష్ట్రంలో తొలిసారిగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ జరుగుతోంది. ఈ ఏడాది జూలై 1ని ఎస్ఐఆర్‌కు క్వాలిఫయింగ్ తేదీగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. 2002 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లు డీమ్డ్ టూ బీ ఎలక్టోరల్ కింద కొనసాగుతారు. వీరంతా ఎన్యుమరేషన్ ఫాం పూర్తిచేసి బీఎల్‌వోలకు అందించాలి. 2002 ఓటర్ల జాబితాలో లేకుండా ప్రస్తుత జాబితాలో ఉన్న వారు ఎన్యుమరేషన్ ఫాంతో పాటు ఎన్నికల సంఘం ప్రకటించిన 12 ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని జత చేసి ఇవ్వాల్సి ఉంటుంది.

# నేరాలు అదుపు చేసేందుకే కార్డునెంట్ సర్చ్

### సిఐ రమణమూర్తి





**లక్షెట్టిపేట మే20(మన సమాజం)**

నేరాలను అదుపు చేసేందుకు పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరుగుతుందని లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని మహాలక్ష్మి వాడ, గోదావరి రోడ్, మోదల రోడ్లో కార్డెన్ సర్చ్ నిర్వహించారు.

ఈ సోదాల్లో సుమారు 46 బైకులు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాడల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇండ్లను అద్దెకిచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకున్నాక అద్దెక్కివ్వాలని పరిచయం లేని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఇండ్లను అద్దెకి ఇవ్వకూడదు అన్నారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంక్ సమాచారాలు ఇతర ఓటిపిలు అడిగితే ఫోన్లో చెప్పకూడదని బ్యాంకు లావాదేవీలు ఏవి ఉన్నా వెంటనే బ్యాంకుకు వెళ్లి చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు మైనర్ తో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్, దండేపల్లి ఎస్సై తహసియోద్దీన్, జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తోపాటు లక్షెట్టిపేట సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవాది చెరువు పూడికతీత పనులు ప్రారంభం..



**రామకృష్ణాపూర్, మే 20, (మన సమాజం):**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డ్ అమరవాది గ్రామంలోని చెరువు పూడిక తీత పనులను కౌన్సిలర్ దాముఖ శిరీష తో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపరితల గని ప్రభావంతో వర్షాకాలంలో చెరువులోకి మట్టి చేరడంతో నీటి నిలువ స్థాయి తగ్గడంతో రైతులు మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యేక చొరవతో సంబంధిత అధికారులు సిఎస్ఆర్ నిధుల నుండి 12 లక్షల 69 వేల రూపాయల విధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి అని దీంతో నీటి నిలువ స్థాయి మట్టం పెరిగి గ్రామ రైతులు పంటలను పండించవచ్చు అన్నారు. అలాగే చెరువుపై ఆధారపడిన మత్స్యకారులకు ఆర్థిక లాభం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బత్తుల వేణు, నాయకులు పల్లె రాజు, రమేష్, మత్స్య సంఘం నాయకులు పెద్దపల్లి ఉప్పలయ్య, నూనె శ్రీనివాస్, ఎల్లేష్, రైతులు పాల్గొన్నారు..

# సు'జలం'.. సు'ఫలం'

**జల జగ డాలకు చెక్ పెట్టేలా తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఫార్ములా**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ఆంధ్రప్రదేశ్, గోదావరి-కావేరి అనుసంధానానికి తెలంగాణ ఓకే**

**కేంద్రం ప్రతిపాదనలకు సూత్రప్రాయ అంగీకారం!.. రెండు భాగాలుగా గోదావరి-కావేరి అనుసంధానం**

**రెండు ప్రాజెక్టులకూ నికర జలాలు, కేంద్రం నిధులు**

**హైదరాబాద్, మే 20:**

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటిదాకా ఒకటిగా ఉన్న గోదావరి–కావేరీ అనుసంధాన ప్రాజెక్టును రెండు భాగాలుగా చేపట్టాలని కేంద్రం ప్రతిపాదించింది. అందులో ఒక భాగం సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్ దాకా కాగా.. రెండోది పోలవరం నుంచి చేపట్టేది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు కీలక అడుగులు పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. 88 టీఎంసీలతో తెలంగాణ చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏపీ అంగీకారం తెలపాలి. దానికి బదులుగా 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలియజేయాలని కేంద్రం షరతు పెట్టింది. ఇందుకు రెండు రాష్ట్రాలూ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇవి కార్యరూపం దాల్చితే తెలుగు రాష్ట్రాలకు జల వివాదాల విషయంలో శాశ్వతంగా మేలు జరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ప్రస్తుతం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉంది. 90 టీఎంసీలతో డీపీఆర్ సమర్పించగా.. నీటి కేటాయింపులపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ 90 టీఎంసీల్లో 45 టీఎంసీలు పోలవరం నుంచి వచ్చే వాటా కాగా.. మరో 45 టీఎంసీలు తెలంగాణలో మైనర్ ఇరిగేషన్‌లో చేసిన పొదుపు ఖాతాలోనివి. ఈ పథకానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చాలాకాలంగా విజ్ఞప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఇటీవలే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. జలవివాదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తితోనే పాలమూరు–రంగారెడ్డికి ఆమోదం తెలుపాలని ఏపీ సీఎం చంద్రబాబును సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా కోరారు. పాలమూరుకు ఆమోదం తెలుపడానికి చంద్రబాబు అంగీకారం వ్యక్తం చేశారని.. అదే సమయంలో పోలవరం నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికి తెలంగాణ సమ్మతి తెలిపేలా చూడాలని ఆయన కోరారని తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలని బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ఉంది. ఆ తీర్పు మేరకు దక్కే 45 టీఎంసీలతో పాటు గోదావరి–కావేరి అనుసంధానంలో తెలంగాణకు వాటాగా ఇవ్వదలుచుకున్న 43 టీఎంసీలు కలుపుకొని 88 టీఎంసీలతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఏపీ ఆమోదం తెలపాలి. అలాగే, సమ్మక్కసాగర్‌లో తెలంగాణ తన వాటా 47 టీఎంసీలు వదులుకోవాలి. గోదావరి–కావేరి అనుసంధానంలో ఏపీ వాటాగా లభించే 45 టీఎంసీలు, కర్ణాటక వాటా 16 టీఎంసీలు(దీనికి బదులుగా బెడ్తి– హీరేవడ్డెటి లింక్ కింద 16టీఎంసీలు కర్ణాటకకు ఇవ్వడం), గోదావరిలో ఏ రాష్ట్రమూ వినియోగించుకొని వాటా కింద 15 టీఎంసీలు, జీసీ లింక్‌లో తమిళనాడు వాటా 44 టీఎంసీలు కలుపుకొని 167 టీఎంసీలతో పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టడానికి తెలంగాణ గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారం కోసం కొన్ని నెలలుగా



ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఏప్రిల్ మూడోవారంలో, ఈ నెల తొలివారంలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు అధ్యక్షతన న్యూఢిల్లీలో కీలక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు కూడా హాజరయ్యారు. కేంద్రం ప్రతిపాదనలపై ప్రాథమిక అంగీకారం కుదిరిందని.. మలిదశలో అపెక్స్ కౌన్సిల్‌లో ఒప్పందం జరిగే అవకాశాలు లేకపోలేదని సమాచారం.

**నదుల అనుసంధానంతో...**

నీటి లభ్యత ఉన్నచోటి నుంచి జలాలు తీసుకెళ్లి కరువు పీడిత ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో 1980లో నేషనల్ పర్ స్పెక్టివ్ ప్లాన్‌లో భాగంగా హిమాయలన్ కాంపోనెంట్ నుంచి పెనిన్సులర్ కాంపోనెంట్‌కు నీటిని తరలించే ప్రతిపాదన వచ్చింది. ఇదే క్రమంలో మహానది(ఒడిశా)–గోదావరి అనుసంధానం కూడా తెరమీదికి తెచ్చారు. ఈ పథకంలో కాటన్ బ్యారేజీ(ధవళేశ్వరం) ఎగువన 230 టీఎంసీలు తెచ్చి వేయాలనేది ప్రతిపాదన. ఇదే క్రమంలో గోదావరిలో 500 టీఎంసీల మిగులు జలాలకు సంబంధించి.. ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్‌తో పాటు మరో నాలుగు అనుసంధాన ప్రతిపాదనలు తెరమీదికి వచ్చాయి. 2014లో రాష్ట్ర అవతవరణ అనంతరం తెలుగు రాష్ట్రాలు గోదావరిలో ఒక్క చుక్కకూడా మిగులు జలాలు లేవని వాదించడంతో ఈ ప్రతిపాదనలన్నీ పక్కనపెట్టారు. ఆ తర్వాత గోదావరిలో ఛత్తీస్‌గఢ్ మరో 50 ఏళ్లయినా వాడుకోని వాటా(148 టీఎంసీల)తో గోదావరి–కావేరీ అనుసంధానం తొలిదశను ప్రతిపాదించారు. దీనికి ఏపీ తప్ప అన్ని రాష్ట్రాలూ సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇచ్ఛంపల్లికి బదులుగా పోలవరం నుంచే గోదావరి–కావేరీ అనుసంధానం చేపట్టాలని ఏపీ బలంగా పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. అంతేకాక.. తాజాగా పోలవరం–బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ప్రాజెక్టును ఏపీ తెరమీదికి తెచ్చింది. దీనికి కొనసాగింపుగానే గోదావరి–కావేరీ అనుసంధానాన్ని రెండు భాగాలుగా ప్రతిపాదించారు. ఒకటి.. సమ్మక్కసాగర్(తుపాకులగూడెం) నుంచి సాగర్ దాకా 43 టీఎంసీల తరలింపు. ఈ 43 టీఎంసీలూ సాగర్ ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి పాలమూరు–రంగారెడ్డిలో వాడుకునే వెసులుబాటు ఇవ్వనున్నారు. రెండోది పోలవరం నుంచి చేపట్టే గోదావరి–కావేరి అనుసంధానం. అందులో భాగంగా ఉమ్మడి గుంటూరుజిల్లాలోని బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మించి, అక్కడి నుంచి టన్నెల్స్ తవ్వడం ద్వారా నీటిని తీసుకెళ్లి.. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లో వేయనున్నారు.

# సీఎం విజయ్‌తో పరిశ్రమల చర్చలు

**సూక్ష్మ పరిశ్రమల ప్రతినిధుల భేటీ**

**పరిశ్రమల బలోపేతంపై చర్చలు**

**అభివృద్ధి చర్యలపై అభిప్రాయాల మార్పిడి**



**చెన్నై, మే 20**
తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ను తమిళనాడు సూక్ష్మ, చిన్న పరిశ్రమల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. చెన్నైలోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు వాసుదేవన్, కార్యదర్శి నిత్యానందం, కోశాధికారి రఘునాథ రాజా, ఉపాధ్యక్షుడు దురైరాజ్ పాల్గొన్నారు. పరిశ్రమల రంగానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని సమావేశంలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఉపాధి అవకాశాల కల్పనతో పాటు పరిశ్రమల విస్తరణకు ఈ రంగం ఎంతో దోహదపడుతోందని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. పరిశ్రమల అభివృద్ధికి ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై కూడా చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని చిన్న పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక ప్రోత్సాహకాలు, విధానపరమైన సహకారం వంటి అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పరిశ్రమల రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత పురోగమిస్తుందని అధికారులు భావిస్తున్నారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక పారిశ్రామిక వేత్తలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, సూక్ష్మ, చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పరిశ్రమల వృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు మరింత పెరుగుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మోదీ-మట్టరెల్లా కీలక భేటీ

**- భారత్-ఇటలీ సంబంధాలపై చర్చలు**

**- వాణిజ్యం, పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి - కృత్రిమ మేధస్సు సహా కీలక రంగాలపై చర్చ**



**రోమ్, మే 20**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటనలో భాగంగా ఇటలీ అధ్యక్షుడు సెర్జియో మట్టరెల్లాను రోమ్‌లో కలిశారు. ఈ సందర్భంగా భారత్–-ఇటలీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా సమావేశం జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు, సాంస్కృతిక సంబంధాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో కూడా సహకారంపై చర్చలు జరిగాయి. కృత్రిమ మేధస్సు, కీలక ఖనిజాలు, అంతరిక్ష రంగం, అణుశక్తి వంటి వ్యూహాత్మక రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు వెల్లడించారు.ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పరస్పర భాగస్వామ్యం మరింత అవసరమని నేతలు భావించినట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేసే అంశాలపై చర్చలు సాగినట్లు సమాచారం. ఇటీవలి కాలంలో భారత్--ఇటలీ మధ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయి. వ్యాపారం, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని పెంచుకుంటున్నాయి. ఈ సమావేశం కూడా ఆ దిశగా మరో కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ భేటీ ఉపయోగపడుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో పలు రంగాల్లో సహకారం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

# విపత్తులపై మాక్ డ్రిల్ నిర్వహణ

**- వరద పరిస్థితులపై సంయుక్త విన్యాసం - పలు సంస్థల సమన్వయంతో నిర్వహణ**

**- అత్యవసర స్పందన సామర్థ్యాల పరిశీలన**



**జమ్మూ కశ్మీర్, మే 20**
విపత్తుల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో సంయుక్త మాక్ డ్రిల్ నిర్వహించారు. జమ్మూ కశ్మీర్‌లోని దుల్‌హస్తి జలవిద్యుత్ ప్రాజెక్టు పరిధిలో ఈ విన్యాసాలు చేపట్టారు. ఆకస్మిక వరద పరిస్థితులను ఆధారంగా తీసుకొని అత్యవసర స్పందన వ్యవస్థలను పరీక్షించారు. ఫ్లాష్ వరదలు సంభవించిన పరిస్థితిని ఊహించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఆధారంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. దుల్ కంపెనీ డ్యామ్ ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా విపత్తు సమయంలో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బందితో పాటు రాష్ట్ర విపత్తు స్పందన దళం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, భారత రెడ్ క్రాస్ సంఘం, జాతీయ జలవిద్యుత్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. పలు విభాగాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ రక్షణ చర్యలను ప్రదర్శించారు. విపత్తు సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, గాయపడిన వారికి వైద్య సహాయం అందించడం, అత్యవసర స్పందన చర్యలను వేగంగా చేపట్టడం వంటి అంశాలపై విన్యాసాలు నిర్వహించారు. ప్రమాద పరిస్థితుల్లో ఎంత వేగంగా స్పందించగలమనే అంశాన్ని పరిశీలించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంత కీలకమో ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైందని అధికారులు పేర్కొన్నారు. విపత్తు సమయంలో సమాచార మార్పిడి, రక్షణ చర్యలు సమర్థంగా సాగేందుకు ఇలాంటి మాక్ డ్రిల్లులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం తగ్గించడంతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంయుక్త విన్యాసాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.

## పుతిన్ చైనా పర్యటన ఆసక్తికరం

**బీజింగ్‌లో పుతిన్‌కు ఘన స్వాగతం**

**జిన్‌పింగ్‌తో కీలక భేటీ చర్చలు**

**అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారింపు**

**బీజింగ్, మే 20:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనా పర్యటనలో భాగంగా బీజింగ్ చేరుకున్నారు. మంగళవారం రాత్రి చైనా రాజధానిలో అడుగుపెట్టిన పుతిన్‌కు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనకు అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం ఏర్పడింది. బుధవారం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్లో పుతిన్‌కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రత్యేక స్వాగతం పలికారు. ఇరు దేశాధినేతలు సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు జరపనున్నారు.ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితులు, ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలు, వాణిజ్యం, వ్యాపారం, రక్షణ రంగం వంటి అనేక అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రపంచ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కూడా అభిప్రాయాలు పంచుకోనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల పాటు పుతిన్ చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సమయంలో పలు కీలక ఒప్పందాలు, వ్యూహాత్మక చర్చలు జరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. రష్యా-చైనా సంబంధాల భవిష్యత్తుపై కూడా ఈ సమావేశం ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రపంచ అగ్రదేశాలైన అమెరికా, రష్యా అధ్యక్షులు తక్కువ వ్యవధిలోనే చైనాను సందర్శించడం ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది. చైనా పర్యటన సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ రష్యా-చైనా సంబంధాలు ప్రస్తుతం ఉన్నత దశకు చేరుకున్నాయని వ్యాఖ్యానించారు.

## కొరియా వీరులకు రాజ్‌నాథ్ నివాళి

**జాతీయ సమాధి వద్ద పుష్పగుచ్ఛం అర్పణ**

**అమర వీరులకు ఘన నివాళులు**

**భారత్ మద్దతు పునరుద్ఘాటించిన మంత్రి**



**సియోల్, మే 20**
భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా అక్కడి జాతీయ సమాధి ప్రాంగణాన్ని సందర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర సైనికులకు పుష్పగుచ్ఛం అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సేవలో అత్యున్నత త్యాగం చేసిన సైనికుల సేవలను రాజ్‌నాథ్ సింగ్ స్మరించుకున్నారు. వారి ధైర్యసాహసాలు, అంకితభావం, దేశభక్తి భావన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులను గౌరవించడం ప్రతి దేశ బాధ్యత అని అన్నారు. జాతీయ సమాధి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా నివాళులు అర్పించారు. భారత్ తరపున దక్షిణ కొరియా వీరులకు గౌరవ సూచకంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.దక్షిణ కొరియా వీరుల త్యాగాలను భారతదేశం కూడా గౌరవిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. వీరుల వారసత్వాన్ని స్మరించుకుంటూ భారత్ దక్షిణ కొరియాతో సంఘీభావం వ్యక్తం చేస్తోందని తెలిపారు. భారత్--దక్షిణ కొరియా మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలోపేతం అవుతున్నాయి. రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో స్నేహ సంబంధాలను మరింత విస్తరించడంలో ఇలాంటి పర్యటనలు కీలక పాత్ర పోషిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఐఏఎస్‌లకు రాష్ట్రపతి కీలక సూచనలు



**న్యూఢిల్లీ, మే 20**
రెండువేల ఇరవై నాలుగు బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ శిక్షణాధికారులు రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న ద్రౌపది ముర్ము యువ అధికారులకు కీలక సూచనలు చేశారు. పరిపాలనా వ్యవస్థలో పనిచేసే అధికారులు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అధికారులు హృదయపూర్వకతతో పాటు తార్కికతను కూడా కలిగి ఉండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. సున్నితంగా వ్యవహరించాలే గానీ భావోద్వేగాలకు లోనుకాకుండా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పరిపాలనలో సమతుల్య దృక్పథం ఎంతో అవసరమని వివరించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలు, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తారని రాష్ట్రపతి తెలిపారు. అందువల్ల ప్రజాప్రతినిధులు లేవనెత్తే అంశాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించాలని రాష్ట్రపతి సూచించారు. ప్రజలకు దగ్గరగా ఉండే పరిపాలన వ్యవస్థ నిర్మాణంలో యువ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని అభిప్రాయపడ్డారు. శిక్షణ దశలోనే ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని తెలిపారు. సేవా దృక్పథం, బాధ్యత, నిజాయితీ వంటి విలువలు అధికారులకు అత్యంత ముఖ్యమని చెప్పారు. దేశ పరిపాలనలో కీలక బాధ్యతలు చేపట్టబోయే ఈ యువ అధికారులు భవిష్యత్తులో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే పరిపాలన ప్రధాన లక్ష్యమని మరోసారి గుర్తు చేశారు.

## బంగ్లాదేశ్‌లో భారత అధికారి మృతి

**దౌత్య కార్యాలయంలో మృతదేహం గుర్తింపు**

**పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ**

**అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభం**

**ఢాకా, మే 20**
బంగ్లాదేశ్‌లో భారత దౌత్య కార్యాలయానికి చెందిన ఓ అధికారి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. బంగ్లాదేశ్‌లోని చట్టోగ్రామ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని నరేన్ ధర్గా గుర్తించారు. స్థానిక అధికారుల వివరాల ప్రకారం నరేన్ ధర్ చట్టోగ్రామ్‌లోని భారత దౌత్య కార్యాలయంలో సహాయ ప్రోటోకాల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆయన మృతదేహాన్ని పాత వీసా కేంద్ర భవనం పరిధిలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. భవనం రెండో అంతస్తులోని స్నానాల గది ద్వారం సమీపంలో నరేన్ మృతదేహం కనిపించిందని సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దౌత్య అధికారికి సంబంధించిన కేసు కావడంతో ప్రత్యేక నిబంధనలను పాటిస్తూ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మృతదేహాన్ని చట్టోగ్రామ్ వైద్య కళాశాల ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాథమికంగా గుండెపోటు కారణంగా మృతి సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఘటనలో ప్రస్తుతం అనుమానాస్పద అంశాలు కనిపించలేదని చెబుతున్నప్పటికీ అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.




## నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## వ్యూస్ కోసం దిగజారొద్దు..

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.





## అవన్నీ రూమర్లే!



అచ్చ తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు. ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## ఇక తమిళం వంతు!

దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే.

ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం.

కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట.

త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.